



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 324, పేజీలు - 08

గురువారం, మే 14, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD





## వారిపై కఠిన చర్యలు తప్పవు

**- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వార్నింగ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణ, మత సామరస్యం కాపాడటం లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. సీవీ ఆనంద్ బుధవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా సూపరింటెండెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ సీఎం,

2లో..

# పార్కింగ్ సమస్యపై 'ఉబర్' దృష్టి పెట్టాలి





**- హైదరాబాద్‌లో ఉబర్ భారీ విస్తరణ**
**- ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ ఆఫీస్**
**- మల్టీలెవల్ పార్కింగ్‌పై సీఎం రేవంత్ కీలక సూచన!**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. వారు బుధవారం రోజున జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసాకికి వచ్చి ఆయనతో సమావేశమయ్యారు. ఉబర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి వారు వివరించారు. హైదరాబాద్‌లో ఉన్న ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు ఖోస్రోషాహి తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తిని వ్యక్తీకరించారు. భవిష్యత్తులో మరింత విస్తరణ చేపడుతామని తెలిపారు. అందుకు ప్రభుత్వ సహకారం ఉండాలని సీఎం రేవంసత్ రెడ్డిని కోరారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ప్రస్తావించారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని ఉబర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు.తగిన

2లో..

# బల పరీక్షలో నెగ్గిన విజయ్

**- 144 ఎమ్మెల్యేల మద్దతు, అన్నా డీఎంకే గల్లంతు**




**చెన్నై (ప్రశ్న న్యూస్)** తమిళనాడు అసెంబ్లీలో విజయ్ తన బలం నిరూపించుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటు వేళ 118 మంది సభ్యుల మద్దతు వేళ ఊహించని రాజకీయం చోటు చేసుకుంది. అయిదు పార్టీలు 120 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన విజయ్ బుధవారం అసెంబ్లీలో బల పరీక్ష ఎదుర్కొన్నారు. ఏకంగా 144 మంది ఎమ్మెల్యేల మద్దతు పొందారు. డీఎంకే వాకౌట్ చేయగా అన్నా డీఎంకే చీలిక వర్గం మద్దతుగా నిలిచింది.
దీంతో కొత్త రాజకీయం మొదలైంది. బల పరీక్షలో తమిళనాడు సీఎం గెలుపొందారు. అసెంబ్లీలో జరిగిన ఓటింగ్ లో 144 మంది విజయ్ కు మద్దతు తెలిపారు. 22 మంది వ్యతిరేకంగా ఓటు వేసారు. బలపరీక్ష సమయంలో డీఎంకే వాకౌట్ చేసింది. 61 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేసిన వారుగా తేల్చారు. బల పరీక్ష వేళ మాజీ సీఎం పళిని స్వామి నేరుగా విజయ్ ను టార్గెట్ చేసారు. దీనికి విజయ్ సైతం గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. సభ సాక్షిగా అన్నా డీఎంకే చీలిక వర్గం విజయ్ కు మద్దతు ప్రకటించింది.
కాగా, బల పరీక్ష చర్చ వేళ ప్రతిపక్ష నేత ఉదయ నిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేసారు. సీఎం విజయ్ కు పూర్తి ప్రజామోదం లేదని వ్యాఖ్యానించారు. డీఎంకే పక్షాలే విజయ్ కు మద్దతుగా నిలిచాయని గుర్తించాలని సూచించారు.కాగా, తనకు మద్దతు ఇచ్చిన వారికి విజయ్ కృతజ్ఞతలు చెప్పారు. తమది సెక్యులర్ ప్రభుత్వంగా పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేసారు. అదే విధంగా గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కొనసాగిస్తామని వెల్లడించారు. తమను వ్యతిరేకించిన వారి కోసం కూడా ప్రభుత్వం

2లో..

# ఇది కొత్త రియాలిటీ.. దీన్ని ప్రోత్సహిద్దాం

**- వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు పిలుపు**
**- పశ్చిమ ఆసియా యుద్ధ నేపథ్యంలో ప్రధాని 8 సూచనలను పాటిద్దామన్న సీఎం**
**- పెట్రోల్ వాడకం, విదేశీ పర్యటనలు తగ్గించుకుని దుబారాకు అడ్డుకట్ట వేయాలని సూచన**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తోందని, ఈ నూతన వాస్తవికతను అందరూ ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలోనూ భవిష్యత్తులో ఈ తరహా విధానాన్ని అమలు చేసే అవకాశాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జాతికి ఇచ్చిన 8 పొదుపు సూచనలను రాష్ట్ర ప్రజలందరూ పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు పౌరులు కూడా బాధ్యతగా ఉండి ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలని సూచించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒకటి రెండు రోజుల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. అమరావతిలోని నిడమర్రులో బుధవారం బొల్లినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (బైసర్) శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.ప్రధాని సూచనల మేరకు పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని చంద్రబాబు అన్నారు. "దేశం మొత్తం దుబారాను తగ్గించాలి. పెద్ద పెద్ద కాన్వాయ్ వాహనాల్లో వెళ్లడం ఒక ఫ్యాషన్‌గా మారింది. ప్రజాప్రతినిధులు కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించి ఆదర్శంగా నిలవాలి. భద్రతను కూడా కుదించుకోవాలి" అని ఆయన హితవు పలికారు. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని, బంగారం కొనుగోళ్లపై కూడా ప్రజలు ఆలోచించాలని సూచించారు. మన దేశంలో,

2లో..

## ఎండలు, వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- తెలంగాణ ప్రజలకు మంత్రి పొంగులేటి హెచ్చరికలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో భానుడి భగభగలు పెరిగిపోతున్నాయి. ఉదయం 8 గంటల తర్వాత ఇంటి నుంచి బయటికి రావాలంటేనే జనాలు జంకుతున్నారు. భారీగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వడదెబ్బ

2లో..

## బండి భగీరథ్‌పై లుకౌట్

# నోటీసులు ఇవ్వాలి

**- కుమారుడి నేరం రుజువైతే బండి సంజయ్ పదవికి రాజీనామా చేయాలన్న కవిత**
**- మోదీతో బండి సంజయ్ వేదికను పంచుకోవడం తప్పుడు సంకేతాలు పంపిందని వ్యాఖ్య**
**- తెలంగాణలో రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకే తమ పార్టీ పుట్టిందన్న కవిత**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత విమర్శనాస్త్రాలు సంధించారు. పోక్సో కేసులో ఉన్న బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా పోలీసులు వెంటనే లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఒకవేళ నేరం రుజువైతే బండి సంజయ్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి తండ్రిగా బండి సంజయ్ ప్రధాని మోదీతో కలిసి వేదికను పంచుకోవడం ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపిందని ఆమె అభిప్రాయపడ్డారు. బాధితురాలి జీవితాన్ని దెబ్బతీసేలా వీడియోలు పోస్ట్ చేసిన

2లో..

# ఆధారాలతో వస్తా

**- సిట్ అధికారులకు బండి భగీరథ్ లెటర్**

**- వ్యక్తిగత కారణాల వల్ల హాజరుకాలేకపోతున్నట్లు వెల్లడి**
**- విచారణకు వచ్చేందుకు మరో రెండు రోజులు కావాలని విజ్ఞప్తి**
**- దర్యాప్తుకు సహకరిస్తానన్న బండి భగీరథ్**
**- విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీని కేటాయించాలని విజ్ఞప్తి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో సంచలనంగా మారిన బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌ను బుధవారం విచారణకు రావాలంటూ సిట్ అధికారులు నోటీసులు ఇచ్చినా రాకపోవడం తీవ్ర చర్చకు దారి తీసింది. బండి భగీరథ్ ఆచూకీ కనిపించడం లేదంటూ ఆరోపణలు వస్తున్న వేళ సిట్‌కు లేఖ రాయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సిట్ విచారణకు రాలేకపోతున్నానని శు క్రవారం అన్ని కీలక ఆధారాలతో వస్తానని బండి భగీరథ్ లేఖ పేర్కొన్నారు.నిజానికి బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు సిట్ విచారణ కోసం పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు రావాలని అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ బండి భగీరథ్ రాలేదు. సిట్ విచారణకు గైర్హాజరు అయిన నేపథ్యంలో తాజాగా బండి

2లో..

# సైబర్ నేరాలపై చంద్రబాబు ఉక్కుపాదం

**- కట్టడికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్**

**- ఏపీలో సైబర్, ఆర్థిక నేరాలపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష**
**- రాష్ట్రవ్యాప్తంగా బాధితులు రూ. 652 కోట్లు నష్టపోయారని వెల్లడి**
**- రూ. 116 కోట్లను కాపాడగలిగిన సీఐడీ, బ్యాంకింగ్ వ్యవస్థ**

2లో..



# దేశవ్యాప్తంగా మే 20న మెడికల్ షాపులు బంద్

**- కోవిడ్-19 సమయంలో ఔషధ విక్రయాలకు సడలింపులు**
**- జీవో తక్షణమే రద్దుచేయాలని కోరుతున్న మెడికల్ షాపులు**
**- ఆన్‌లైన్‌లో అమ్మకాలు, భారీ డిస్కౌంట్లతో నష్టపోతున్నామని ఆవేదన**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఔషధాలు ఆన్‌లైన్‌లో విక్రయాలు, ఈ-ఫార్మసీ ప్లాట్‌ఫారమ్‌లు ఇస్తున్న భారీ డిస్కౌంట్లకు నిరసనగా కెమిస్ట్‌లు దేశవ్యాప్త బంద్‌కు సిద్ధమవుతున్నారు. మే 20న దేశవ్యాప్తంగా 12.4 లక్షల మందికి పైగా కెమిస్టులు ఈ బంద్‌లో పాల్గొననున్నారని ఔషధ దుకాణాల వర్తకుల అసోసియేషన్ వెల్లడించింది. దీంతో రోగుల సాధారణ మందుల కొనుగోళ్లకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. నియంత్రణ లేని ఆన్‌లైన్ విక్రయాల వల్ల రోగుల భద్రతకు ఎదురయ్యే ప్రమాదాలను ఎత్తిచూపడమే ఈ బంద్ ప్రధాన

2లో..

# డబ్బులు బయటకు విసిరి..

## టాయిలెట్‌లో ఫైళ్లు దాచి

**- ఏసీబీ దాడితో శంషాబాద్ తహసీల్దార్ కష్టాలు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఏసీబీ దాడులు చేసినప్పుడు డబ్బులు,ఫైళ్లను ఎక్కడెక్కడో దాచి పెట్టే సన్నివేశాలు చాలా సినిమాల్లో చూసి ఉంటాం. కానీ ఇలాంటివి నిజంగా జరుగుతాయి. శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం బుధవారం ఇలాంటి ఒక హై-డ్రామాకు వేదికైంది. అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మికంగా దాడి చేయడంతో, అక్కడ పనిచేస్తున్న సిబ్బందిలో వణుకు మొదలైంది. ఏసీబీ కంట పడకుండా ఉండేందుకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి. కృష్ణ చేసిన పని ఇప్పుడు చర్చనీయాంశమైంది. తన వద్ద ఉన్న రూ.29,650 నగదును బయట పారేయడమే కాకుండా, ఒక కీలకమైన ప్రభుత్వ ఫైలును ఏకంగా టాయిలెట్ పైకప్పు మీద దాచిపెట్టే ప్రయత్నం చేస్తూ అడ్డంగా దొరికిపోయారు. అవినీతి తీగ లాగితే తహసీల్దార్ కారు డ్యాష్ బోర్డులో డొంక కదిలింది. తహసీల్దార్ కె. రవీందర్ దత్ కారును తనిఖీ చేయగా, అందులో లెక్కల్లో చూపని రూ.60,000 నగదు లభించింది. అలాగే లైసెన్స్‌డ్ సర్వేయర్ ఎస్. పృథ్వీరాజ్ వద్ద మరో రూ.10,000 అక్రమ నగదును ఏసీబీ స్వాధీనం చేసుకుంది. కార్యాలయంలో ఏ సెక్షన్‌ను కదిలించినా అక్రమాలే దర్శనమివ్వడంతో అధికారులు విస్తుపోయారు. కేవలం డబ్బులే కాకుండా, పరిపాలనా పరంగా జరిగిన ఘోర తప్పిదాలు కూడా బయటపడ్డాయి. నిర్ణీత సమయం ముగిసినా 68 మీ-సేవ దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, తన పరిధిలో లేని శంషాబాద్, తొండపల్లి, సాతంరాయి గ్రామాలకు సంబంధించిన సర్టిఫికెట్లు, ప్రొసీడింగ్స్ జారీ చేయడంలో తహసీల్దార్ నిబంధనలు ఉల్లంఘించినట్లు ఏసీబీ తేల్చింది. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అక్రమ మార్గాల్లో పనులు చక్కబెడుతున్నట్లు నిర్ధారించారు.

2లో..

# వారిపై కఠిన చర్యలు తప్పవు

డిప్యూటీ సీఎం స్థాయిలో జరిగిన సమీక్షా సమావేశాలలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం ఈ నెల చివరలో జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణా, స్మగ్లింగ్‌ను కఠినంగా నిరోధించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అక్రమ పశువుల స్మగ్లింగ్‌ను అరికట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్‌పోస్టులతో పాటు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల వెంబడి 52 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను కూడా ఏర్పాటు చేసినట్టుగా తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని, రాబోయే 15 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయన అధికారులను ఆదేశించారు.చెక్ పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫీట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని... బక్రీద్ పండుగ ముగిసే వరకు ఈ తనిఖీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. శాంతి భద్రతల దృష్ట్యా బక్రీద్ పండుగ ఇతర పండుగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలను ప్రస్తావిస్తూ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.శాంతిభద్రతల పరిరక్షణను ప్రస్తావిస్తూ ఏ వ్యక్తి గానీ, సమూహం గానీ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. పశువుల రవాణాకు సంబంధించి కేవలం అనుమానం ఆధారంగా రోడ్లను దిగ్బంధించడం లేదా ఘర్షణలకు దిగడం వంటివి చేయవద్దని ఆయన ఖురేషీ సంఘాలు, గోరక్షణ బృందాల సభ్యులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైన చోట రౌడీ/అనుమానితుల వివరాలు కూడా నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఇరు వర్గాల ప్రతినిధులతో విడివిడిగా సమన్వయ సమావేశాలు నిర్వహించి, అపార్థాలు, ఉద్రిక్తతలను నివారించేందుకు అవగాహన కల్పించాలని పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలను డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. సమర్థవంతమైన సమాచార మార్పిడి కోసం పోలీస్, పురపాలక యంత్రాంగం, పశుసంరక్షణ, రెవెన్యూ శాఖల మధ్య సన్నిహిత సమన్వయం అవసరమని డీజీపీ చెప్పారు. జిల్లా, క్షేత్రస్థాయిల్లో ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, స్వాధీనం చేసుకున్న పశువుల కోసం తగినన్ని పశువుల షెల్టర్లను ఏర్పాటు చేయాలని, వాటికి మేత, నీటితో సహా సరైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని డీజీపీ అధికారులను ఆదేశించారు. రెచ్చగొట్టే లేదా తప్పుదోవ పట్టించే కంటెంట్‌ను పోస్ట్ చేసే వ్యక్తులను గుర్తించి, పోలీస్ స్టేషన్లకు పిలిపించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత బక్రీద్ పండుగల సమయంలో జరిగిన సంఘటనలు, కేసులను ప్రస్తావించిన ఈ ఏడాది రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## పార్కింగ్ సమస్యపై 'ఉబర్' దృష్టి పెట్టాలి

పార్కింగ్ సౌకర్యాలు లేక మెట్రో స్టేషన్ల వంటి ప్రాంతాల్లో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్ల ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనలపై సమగ్రంగా అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధి బృందం తెలిపింది.హైదరాబాద్‌కు సమీపంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ గురించి ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదని అన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయన్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే చేపట్టిన ఫ్యూచర్ సిటీ ప్రాధాన్యత ఉందన్నారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

## బల పరీక్షలో నెగ్గిన విజయ్

పని చేస్తుందని స్పష్టం చేసారు. తమ ప్రభుత్వం హార్స్ ట్రేడింగ్ చేయలేదని హార్స్ స్పీడ్‌లో మా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పుకొచ్చారు. అందరికి సామాజిక న్యాయం మా ధ్యేయంగా ప్రకటించారు. ఇక సీఎం విజయ్‌పై ఉదయనిధి స్టాలిన్ విమర్శలు చేసారు. టీవీకే పార్టీకి మెజారిటీ రాలేదని వ్యాఖ్యానించారు. ప్రజామోదం పొందడంలో విజయ్ పార్టీ విఫలమైందని విమర్శించారు. టీవీకేకు బయట నుంచి మాత్రమే మద్దతు ఉందని చెప్పారు. 65 శాతం ప్రజలు విజయ్‌ని తిరస్కరించారని వ్యాఖ్యానించారు.అవినీతి పార్టీలతో విజయ్ పార్టీ కలిసిపోయిందని విమర్శించారు. ఇప్పటికే ప్రజల నమ్మకాన్ని విజయ్ కోల్పోయారని చెప్పారు. టీవీకేకు ఓటేసిన ప్రజలు బాధపడుతున్నారని వివరించారు. తమ ఎమ్మెల్యేలను సీఎం విజయ్ కలవడం సరికాదని మాజీ సీఎం పళనిస్వామి వ్యాఖ్యానించారు. తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఆఫర్ చేశారని చెప్పుకొచ్చారు. దీని ద్వారా విజయ్ పూర్తి స్థాయిలో మెజార్టీ ప్రభుత్వం గా కొనసాగనుంది.

## ఇది కొత్త రియాలిటీ.. దీన్ని ప్రోత్సహిద్దాం

రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయని, విదేశాలకు బదులు స్వదేశీ పర్యాటకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు ఎంతో అందమైనవని, సూర్యలంకను గోవాను మించిన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. "నా దేశం – నా బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు.

### అమరావతికి వైద్య, విద్య హబ్ గుర్తింపు

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులన్నీ ఆటోపైలట్ మోడ్‌లో ఇచ్చే బాధ్యత తమదని, పారిశ్రామికవేత్తలు వేగంగా నిర్మాణాలు పూర్తిచేసి కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. విద్య, వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ తిరుగులేని శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. "ప్రపంచంలోని ప్రతి ముగ్గురు వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిలో ఒకరు అమరావతి నుంచే తయారుకావాలి," అని ఆయన తన లక్ష్యాన్ని స్పష్టం చేశారు. బైసర్, కిమ్స్ సంస్థలు ఈ లక్ష్య సాధనకు దోహదపడతాయన్నారు. 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 250 మెడికల్ సీట్లు, నైపుణ్యాభివృద్ధి ద్వారా లక్ష మందికి ఉపాధి కల్పించేలా ఈ సంస్థలు విస్తరించనున్నాయని తెలిపారు. వచ్చే ఏడాది ఇదే రోజున కిమ్స్ ఆసుపత్రి ప్రారంభం కావాలని ఆకాంక్షించారు.

### క్వాంటమ్ వ్యాలీతో కొత్త శకం

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ రాబోతోందని, ఇది దేశంలోనే ఒక నూతన అధ్యాయమని చంద్రబాబు అన్నారు. "ఈ ఏడాది డిసెంబర్ నాటికి మన దేశంలోనే మొదటి క్వాంటమ్ కంప్యూటర్‌కు ఏపీ చిరునామాగా మారుతుంది. రెండేళ్లలో అమరావతి నుంచి ప్రపంచానికి క్వాంటమ్ కంప్యూటర్లు సరఫరా చేస్తాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి సంస్థలు ఇప్పటికే పనులు ప్రారంభించాయని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి భారీ ప్రాజెక్టులతో రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని, తన జీవితంలో అలాంటి అరాచక పాలనను చూడలేదని విమర్శించారు. తన ప్రభుత్వ లక్ష్యం పిల్లల భవిష్యత్తు, యువతకు ఉద్యోగాలేనని స్పష్టం చేశారు.గత పాలకులు ప్రజలపై రూ.32 వేల కోట్ల విద్యుత్ భారం మోపారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చార్జీలు పెంచలేదని, భవిష్యత్తులో కూడా పెంచబోమని హామీ ఇచ్చారు. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి బడ్జెట్‌లో వైద్య రంగానికి రూ.20 వేల కోట్లు కేటాయించామని గుర్తుచేశారు. అమరావతిని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని, విశాఖను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్, టెక్నాలజీ హబ్‌గా మారుస్తామని, 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 24 లక్షల ఉద్యోగాలు సృష్టించే లక్ష్యంతో పనిచేస్తున్నామని చంద్రబాబు వివరించారు.

# డబ్బులు బయటకు విసిరి..
## టాయిలెట్‌లో ఫైళ్లు దాచి

ఈ దాడుల సందర్భంగా స్వాధీనం చేసుకున్న నగదు, పత్రాలకు సంబంధించి అధికారులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. సామాన్యుల పనులను పెండింగ్‌లో పెట్టి, అక్రమార్కుల కోసం నిబంధనలు పక్కన పెట్టిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీబీ స్పష్టం చేసింది. సినిమా స్టైల్‌లో తప్పించుకోవాలని చూసినా, సాంకేతిక ఆధారాలతో సహా నిందితులను పట్టుకున్న ఏసీబీ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

## ఎండలు, వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తగలడం, అస్వస్థతకు గురికావడం వంటి సంఘటనలు పెరిగిపోతున్నాయి. మరోవైపు ఎండలు మండిపోతుండటంతో జనాలు ఇళ్ల నుంచి బయటికి కాలు పెట్టలేకపోతున్నారు. ఈ క్రమంలోనే రాబోయే రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయింది. ఎండల పట్ల రాష్ట్ర ప్రజలు అలర్ట్‌గా ఉండాలని తెలంగాణ రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా కీలక సూచనలు చేశారు.అత్యవసరం అయితే తప్ప ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇళ్ల నుంచి ప్రజలు బయటికి రావద్దని మంత్రి పొంగులేటి సూచించారు. కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలిపారు. ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో తీవ్రమైన వడగాలుల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కూడా వేడి గాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు.తీవ్రమైన వడగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన ఆకస్మిక వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి.. ప్రజలకు సూచనలు చేయాలని ఆదేశించారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున తాగునీటికి ఎక్కడా కొరత లేకుండా వడదెబ్బ మరణాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లతోపాటు అవసరమైన మందులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్న జిల్లాల్లో అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

## బండి భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు ఇవ్వాలి

వారిని అరెస్ట్ చేయాలని, ఆ అకౌంట్లను బ్లాక్ చేయాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయాలని కవిత అన్నారు. ఇప్పటివరకు ఆయన ఈ ప్రాజెక్టును ఒక్కసారి కూడా సందర్శించకపోవడం ఏమిటని ఆమె ఆక్షేపించారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని, కానీ తెలంగాణ ప్రభుత్వం నీటి వనరుల వినియోగంలో విఫలమవుతోందని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కులగణనలో ఓబీసీ కాలమ్ తప్పనిసరిగా ఉండాలని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం దేశవ్యాప్తంగా పోరాడతామని కవిత తెలిపారు. నీట్ పేపర్ లీక్ గురించి ఆమె మాట్లాడుతూ... జాతీయ స్థాయి పరీక్షల పేపర్ లీక్ ఘటనలను కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. తెలంగాణలో ఉన్న రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికే తమ పార్టీ పుట్టిందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## సైబర్ నేరాలపై చంద్రబాబు ఉక్కుపాదం

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో పెరిగిపోతున్న సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ నేరాల కట్టడికి పటిష్ఠమైన యాక్షన్ ప్లాన్ రూపొందించడమే లక్ష్యంగా సచివాలయంలో బుధవారం ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సైబర్ నేరాల తీవ్రత, వాటిని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు రాష్ట్రంలోని సైబర్ నేరాల పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో సైబర్, ఆర్థిక నేరాలకు సంబంధించి '1930' టోల్ ఫ్రీ నెంబర్‌కు బాధితుల నుంచి ఏకంగా 9.29 లక్షల ఫిర్యాదులు అందాయని, ఇది సమస్య తీవ్రతకు అద్దం పడుతోందని తెలిపారు. ఇప్పటివరకు బాధితులు సుమారు రూ.652 కోట్ల మేర నగదును కోల్పోయారని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.ప్రస్తుతం పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాలే (ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్) అతిపెద్ద ఆర్థిక నేరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటితో పాటు ఫిషింగ్, విషింగ్, క్రెడిట్/డెబిట్ కార్డు మోసాలు, ఆన్‌లైన్ లోన్ ఫ్రాడ్స్, 'డిజిటల్ అరెస్ట్' వంటి కొత్త తరహా మోసాలతో ప్రజలు నిలువునా దోపిడీకి గురవుతున్నారని వివరించారు. అయితే, సీఐడీ సైబర్ క్రైమ్ విభాగం, బ్యాంకర్లతో కలిసి సమర్థవంతంగా పనిచేస్తూ రూ.116 కోట్లకు పైగా మొత్తాన్ని నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లకుండా నిలువరించగలిగామని అధికారులు చెప్పడం కొంత ఊరటనిచ్చింది. 'గోల్డెన్ అవర్'లో తక్షణమే స్పందించడం ద్వారా ఇది సాధ్యమైందని తెలిపారు.దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటే పోలీస్ యంత్రాంగం, బ్యాంకర్ల మధ్య మరింత దృఢమైన సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. ఇతరుల బ్యాంకు ఖాతాలను నేరగాళ్లు దుర్వినియోగం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఒక సమగ్ర 'ఏపీ సైబర్ పాలసీ'ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర స్థాయిలో సీఐడీ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ పనిచేస్తోందని అధికారులు తెలిపారు. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలలో ప్రత్యేక సైబర్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమీక్షలో హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఏపీ ఫోరెన్సిక్స్ సలహాదారు కేపీసీ గాంధీ, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు పాలుపంచుకుని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## దేశవ్యాప్తంగా మే 20న మెడికల్ షాపులు బంద్

ఉద్దేశమని ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ప్రకటించింది.సరైన ధ్రువీకరణ లేకుండానే ఔషధాలను విక్రయిస్తున్నారని, దీనివల్ల పాత ప్రిస్క్రిప్షన్లను మళ్లీ మళ్లీ వాడుతున్నారని అసోసియేషన్ ఆరోపించింది. యాంటీబయాటిక్స్, రోజువారీగా వాడే ఔషధాలు లభ్యత సులభమవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఏఐ ద్వారా సృష్టించిన నకిలీ ప్రిస్క్రిప్షన్లు, అదుపులేని విక్రయాల వల్ల యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. కోవిడ్ సమయంలో ఇచ్చిన సడలింపులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ-ఫార్మసీలు నిబంధనల నుంచి తప్పించుకోవడానికి ఈ తాత్కాలిక వెసులుబాటును వాడుకుంటున్నాయని కెమిస్టులు ఆరోపిస్తున్నారు.ఆన్‌లైన్‌లో ఇచ్చే భారీ డిస్కౌంట్ల వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్థానిక ఔషధ దుకాణాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని రిటైల్ ఫార్మసిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య అవసరాల కోసం ప్రజలు మొదట ఈ స్థానిక దుకాణాలనే ఆశ్రయిస్తారని వారు గుర్తు చేశారు. ఔషధ దుకాణాల వ్యాపారంపై ఆధారపడిన సుమారు ఐదు కోట్ల మంది ప్రభావితమయ్యే అవకాశం ఉందని అసోసియేషన్ పేర్కొంది. అసోసియేషన్ అధ్యక్షుడు జేఎనన్ షిండే, ప్రధాన కార్యదర్శి రాజీవ్ సింఘాల్ మాట్లాడుతూ "ఇది కేవలం వ్యాపారానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు రోగుల భద్రతకు సంబంధించింది" అని అన్నారు. మే 20లోగా ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అయితే, బంద్ సమయంలో రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉంటాయని కెమిస్ట్ అసోసియేషన్లు తెలిపాయి.

# ఆధారాలతో వస్తా

భగీరథ్ సిట్ అధికారులకు ఒక లేఖ రాయడం గమనార్హం. తాను వ్యక్తిగత కారణాల వల్ల సిట్ విచారణకు హాజరు కాలేకపోతున్నానని శుక్రవారం రోజున విచారణకు వస్తానని స్పష్టం చేశారు. అయితే తనపై నమోదైన పోక్సో కేసులో తన వద్ద ఉన్న అన్ని కీలక ఆధారాలతో విచారణ అధికారుల ముందుకు వస్తానని పేర్కొన్నారు. తనపై నమోదైన పోక్సో కేసులో పూర్తిస్థాయిలో విచారణకు సహకరిస్తానని తేల్చి చెప్పారు.మరోవైపు ఈ పోక్సో కేసులో తనను అరెస్ట్ చేయకుండా ఉండేందుకు బండి భగీరథ్ ఇప్పటికే తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం. ఈ పిటిషన్‌ను మంగళవారం దాఖలు చేయగా ప్రస్తుతం హైకోర్టుకు సెలవులు ఉండటంతో నేడు వెకేషన్ బెంచ్ ముందు విచారణకు రానుంది. ఈ నేపథ్యంలోనే కోర్టు నుంచి ఎలాంటి ఉత్తర్వులు వస్తాయో చూసిన తర్వాత సిట్ విచారణకు హాజరు కావాలని బండి భగీరథ్ వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ కేసులో సిట్ అధికారులు రెండోసారి బాధితురాలి స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసులో కఠినమైన పోక్సో సెక్షన్లను అదనంగా చేర్చడం తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ నేపథ్యంలోనే ఈ కేసులో బాధితురాలి వయసు కీలకంగా మారింది. ఆమెకు రెండు బర్త్ సర్టిఫికెట్లు ఉన్నట్లు వార్తలు రావడంతో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ క్రమంలోనే ఎల్లుండి బండి భగీరథ్ విచారణ సమయంలో ఎలాంటి ఆధారాలను సమర్పిస్తారు అనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది.

## ఇల్లు ధ్వంసం చేసిన దుండగులు

**ఉయ్యూరు** స్థానిక బస్టాండ్ వెనుక చాంద్ నగర్ లో ఈడే ప్రసాద్ అనే వ్యక్తికి చెందిన ఇంటిని దుండగులు ధ్వంసం చేసి, తగలబెట్టారు. మూడు రోజుల క్రితం గృహప్రవేశం చేశానని, రెండు రోజుల్లో ఇంట్లోకి వచ్చేవాడిని, ఇంతలోనే కొంతమంది దుండగులు మద్యం సేవించి, తాళం వేసిన ఇంటికి గడియ విరగ కొట్టి, ఇంట్లోకి ప్రవేశించి ధ్వంసం చేశారని బాధితుడు వాపోయాడు. పోలీసులు రంగంలోకి పోలీసులు, డాగ్స్ టీం దిగారు. శునకాలు తన ఇంటి వెనకవైపు ఉన్న ఓ ఇంట్లోకి వెళ్లినట్టు సమాచారం. సుమారు పది లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందని, పోలీసులు తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు...

## ఆళ్లగడ్డలో వేసవి సెలవుల దృష్ట్యా
# సమ్మర్ క్యాంపులు



**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ లో వేసవి సెలవుల దృష్ట్యా సమ్మర్ క్యాంపు లను నిర్వహిస్తున్నట్లు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. పిల్లలు మొబైల్ ఫోన్స్ కు అడిక్ట్ అయి వారి జీవితాలను నాశనం చేసుకోకుండా.. భూమా ట్రస్ట్ కింద బేసిక్ కంప్యూటర్ ట్రైనింగ్, బాడ్మింటన్, స్పోకెన్ ఇంగ్లీష్, తైక్వాండో,అబాకస్ తదితర అంశాలపై ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శోభా నాగిరెడ్డి ట్రస్ట్ కింద వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వివరించారు.ఆళ్లగడ్డ నియోజక వర్గ ప్రజలకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తీపి కబురు అందించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం లో ప్రతి శుక్రవారం నంద్యాల జిల్లా కలెక్టర్ పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి నియోజకవర్గంలో పిజిఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడంతో ఇకపై ప్రతి శుక్రవారం ఆళ్లగడ్డలో కూడా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే భూమా తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని తెలిపారు.

## స్వచ్ఛభారత్ - స్వచ్ఛ - క్రీడా మైదాన్



**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ ఎద్దుల పాపమ్మ పెద్ద మద్దిలేటి రెడ్డి ( జఖఖఓ) ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని ఆర్.ఆర్ అకాడమీ క్రీడాకారులు స్వచ్ఛభారత్ - స్వచ్ఛ - క్రీడా మైదాన్ స్లోగన్ తో క్రీడా మైదానాన్ని సమ్మర్ కోచింగ్ శిక్షణలో భాగంగా శిక్షణ చేస్తున్నటువంటి క్రీడాకారులతో కోచ్ డిపి సుబ్బారాయుడు ,, ఎల్ ఓబులేసు , తమ క్రీడాకారులతో మైదానంలో చుట్టు ప్రక్కన ఉన్నటువంటి కంప చెట్లను , ప్లాస్టిక్ పేపర్స్ మరియు చెత్తను వైపిపీఎం గవర్నమెంట్ కాలేజ్ తెలుగు లెక్చరర్ మల్లేశ్వర్ రెడ్డి గారు క్రీడాకారులతో కలసి క్రీడా మైదాన పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు కోచ్ సుబ్బారాయుడు మాట్లాడుతూ ఆళ్లగడ్డ గవర్నమెంట్ హై స్కూల్ స్కూల్, మరియు కాలేజ్ సంబంధించినటువంటి ఈ క్రీడా మైదానానికి గతంలో ఈ గ్రౌండ్ లో శిక్షణ చేసి రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి పోటీలో పాల్గొని పతాకాలు సాధించిన వారు ఉన్నారు వ్యాయామ ఉపాధ్యాయ రంగంలో , పోలీస్ రంగంలో, ఆర్మీ నేవీ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలలో కూడా ఉద్యోగాలు సాధించిన వారు ఉన్నారు ఈ గ్రౌండ్ను శుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అని గ్రౌండ్లో శిక్షణ చేసుకునేవారు ప్రతి ఒక్కరు అనుకున్నప్పుడే ఈ క్రీడా మైదానం శుభ్రంగా ఉంటుంది అని అన్నారు

## గృహప్రవేశ వేడుకలకు
# హాజరైన కూటమి నాయకులు



**తుగ్గలి:** తుగ్గలి మండల పరిధిలోని గిరిగేట్ల గ్రామం నందు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,గిరిగేట్ల గ్రామ మాజీ ఉపసర్పంచ్ రామచంద్రయ్య నూతనంగా నిర్మించిన గృహప్రవేశ వేడుకలకు మండల పరిధిలోని గల పలువురు కూటమి నాయకులు హాజరయ్యారు.బుధవారం రోజున నిర్వహించిన గృహప్రవేశ వేడుకలకు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు,మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్,ఎర్రగుడి వెంకటస్వామి,పత్తికొండ నియోజకవర్గం బిజెపి నాయకులు తుగ్గలి నవీన్ రెడ్డి,మాజీ సర్పంచ్ మధుబాబు తదితర మండల కూటమి నాయకుల హాజరై బహుమతులను ప్రధానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగయ్య,తెలుగు యువత మండల అధ్యక్షుడు సత్య ప్రకాష్,బలరాముడు,ఎఫ్ఏ సతీష్,మదీష్,వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి ఉపశమనానికి
# చలివేంద్రం ఏర్పాటు అభినందనియం
### - పెదకూరపాడు తహసిల్దార్ నీలి ధనలక్ష్మి

**పెదకూరపాడు,**వేసవి ఉపశమనానికి చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దకూరపాడు తహసిల్దార్ నీలి ధనలక్ష్మి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని తాసిల్దార్,ఎంపీడీవో, అగ్రికల్చర్,ఉపాధి హామీ,గృహ నిర్మాణ తదితర శాఖల ప్రాంగణంలో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని తాసిల్దార్ నీలి ధనలక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ ధనలక్ష్మి మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని వడదెబ్బ తగిలే ప్రమాదం ఉన్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

జన చైతన్య సమితి ప్రతినిధి లియాఖాత్ ఆలి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకూడదని చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, రెవిన్ ఇన్స్పెక్టర్ నేలటూరి వంశీకృష్ణ ,విలేజ్ రెవెన్యూ అధికారులు మట్టుపల్లి శిలువ కుమార్(లగడపాడు), నల్లమోతు నరసింహారావు, షేక్ జాన్ సైదా (పెదకూరపాడు),పెరికల నాయుడమ్మ (పాటిబండ్ల), జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు,షేక్ సుభాని తదితరులు ఉన్నారు.

# బక్రీద్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పటిష్ట భద్రతా చర్యలు: డీజీపీ సి.వి ఆనంద్

## గోవుల అక్రమ రవాణా, గోవధ నివారణపై ప్రత్యేక దృష్టి



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ సి.వి ఆనంద్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనరేట్ల పోలీసు అధికారులు,సంబంధిత శాఖల అధికారులతో రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో, పరస్పర సామరస్యంతో జరుపుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీజీపీ గారు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా చట్టవిరుద్ధ కార్యకలాపాలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ప్రత్యేకంగా గోవుల అక్రమ రవాణా, గోవధ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన నిఘా ఉంచాలని పేర్కొన్నారు. సంతల్లో కొనుగోలు చేసిన పశువులకు సంబంధిత పశు వైద్యాధికారులచే జారీ చేసిన ఆరోగ్య ధృవీకరణ పత్రాలు, రవాణా అనుమతి పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని స్పష్టం చేశారు. పత్రాలు లేకుండా పశువులను రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు, చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, పశువుల రవాణా ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి 24 గంటల నిఘా కొనసాగించాలని ఆదేశించారు. అలాగే అక్రమంగా గోవులను రవాణా చేస్తున్నారనే పేరుతో కొందరు వ్యక్తులు లేదా సంఘాలు బృందాలుగా ఏర్పడి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం, అల్లర్లు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా పోలీసు శాఖదేనని, ఎవరూ స్వచ్ఛందంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని అన్నారు. ప్రతి జిల్లాలో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి మత పెద్దలు, స్థానిక నాయకులతో సమన్వయం పెంచాలని అన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం, మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు వ్యాప్తి చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అలాంటి పోస్టులను వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పండుగ సందర్భంగా మసీదులు, ప్రార్థనా స్థలాలు, రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు మరియు ముఖ్య కూడళ్ల వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను డీజీపీ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే , డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సి.ఐ రవి, డిటిఓ లక్ష్మణ్ , రెవెన్యూ, వెటర్నరీ శాక అధికారులు పాల్గొన్నారు.

# నీట్ పై ఎన్టీఏ డేగ కన్ను, కన్ఫ్యూజ్ లో పిల్లల భవిష్యత్





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత దేశంలో అత్యధికంగా గిరాకీ ఉన్న కోర్సులు గేట్, ఐఐటీ మెయిన్స్ (అడ్వాన్స్)ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కోర్సు అంటే నీట్.సంవత్సరానికి ఒకసారి ఈ పరీక్ష కేంద్రం నిర్వహిస్తుంది.రాష్ట్రాల జోక్యం లేకుండా "నీట్ పరీక్షలు"నిర్వహిస్తున్నారు.గత కొన్నేళ్లుగా రాష్ట్రాల నుంచి వ్యతిరేకత వస్తున్నప్పటికీ, కేంద్రం పెడచెవిన పెడుతూ తన పని తాను చేసుకుంటూ పోతుంది.నాలుగేళ్ల క్రితం తమిళనాడులో "నీట్ పరీక్ష"విద్యార్థి ప్రాణం తీసింది.గతంలో కూడా జైపూర్ కేంద్రంగా నీట్ పరీక్ష పేపర్లు లీక్ అవ్వడంతో ఎంతో కష్టపడి పరీక్ష రాసిన ఓ పేదవిద్యార్థికి చుక్కెదురైంది.దీంతో తమిళనాడులో విద్యార్థి సంఘాలు రోడ్డెక్కాయి.ఇలా ఒకటి కాదు రెండు కాదు అనేక సందర్భాల్లో నీట్ పరీక్ష వల్ల జరుగుతున్న తప్పిదాలతో పిల్లలు తన తనువు చాలిస్తున్నారు.ఈ నేపథ్యంలో మే "3"జరిగిన నీట్ యూజి పరీక్ష పేపర్లు లీక్ ఆరోపణలు, అక్రమ దారిలో తప్పాయని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) గుర్తించడంతోరద్దు చేసింది.అలాగే సెంట్రల్ ఏజెన్సీల నివేదికల ఆధారంగా ఈ సంవత్సరం నీట్ పరీక్ష వాయిదా వెయ్యాల్సి వచ్చిందన్నారు.అదిగాక త్వరలో కొత్త తేదీలు ప్రకటిస్తామని,విద్యార్థులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం లేదని అధికారులు సూచించారు.

### నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) వివరణ

పరీక్ష రద్దుకు కారణం: రాజస్తాన్,బీహార్ లలో నీట్ పరీక్ష పేపర్లు లీక్ అయినట్లు వచ్చిన సమాచారం.సెంట్రల్ఏజెన్సీ ల ద్వారా నివేదికలు మేరక పరీక్ష విధానంలో అక్రమాలు జరిగిన కారణాంగా పరీక్ష రద్దు చేసినట్లు తెలిపారు.జీరో టాలరెన్స్: పరీక్ష వ్యవస్థ నమ్మకాన్ని కాపాడటానికి , కొంతమంది చేసిన తప్పుల వల్ల మొత్తం వ్యవస్థను టార్గెట్ చేయదనే ఉద్దేశంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఎన్టీఏ డిజీతెలిపారు.సిబిఐ విచారణ:ఈపేపర్ లీక్ కేసును సమగ్ర విచారణ కోసం సిబిఐకి అప్పగించారు.పునర్ పరీక్ష:దేశంలో నీట్ పరీక్షకు ఇరవై రెండు లక్షల పైచిలుకు మంది విద్యార్థులకు కొత్త పరీక్ష తేదీలను త్వరలో అధికారికంగా వెబ్ సైట్లో ప్రకటిస్తామని చెప్పారు.అలాగే సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలు నమ్మకూడదని, కేవలం అధికారిక సమాచారం కోసం వేచి చూడాలని ఎన్టీఏ అధికారులు చెబుతున్నారు.

### నీట్ పరీక్ష రద్దు పై లోక్ భవన్ వద్ద ధర్నా

ఈ నెల "3"జరిగిన నీట్ యూజీ పరీక్ష రద్దు పై లోక్ భవన్ వద్ద ధర్నా నిర్వహించిన బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్.ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ–నీట్ పరీక్ష ప్రశ్న పత్రం లీకేజీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే అన్నారు.దేశ వ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన నీట్ పేపర్ లీక్.పరీక్ష నిర్వహణ లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విఫలం.లక్షలాది మంది విద్యార్థులు రాత్రి పగలు కష్టపడి చదివితే వారికి దక్కింది పేపర్ లీక్ లేఅన్న విషయం.ఇదే ఈ సంవత్సరమే కాదు ప్రతి మూడు నాలుగేళ్ల కొకసారి జరుగుతున్న తతంగం.బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రాలు పేపర్ లీకేజీలకు కేరాఫ్ అడ్రస్ గా మారాయి అని చెప్పకనే చెబుతున్నాయి ఈ సంఘటనలు.గతంలో 2021లో 2024లో నీట్ పరీక్ష పత్రం లీక్ అయిన దాని నుంచి ఎన్టీఏ గుణపాఠం నేర్చుకొకపోవడం వల్లే మళ్లీ ఈ ఘటనలు పునరావృతం అవుతున్నాయి.2024లో నీట్ లీకేజీ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కే రాధాకృష్ణన్ కమిటీ ని నియమించింది.రాధాకృష్ణన్ కమిటీ నీట్ పరీక్ష ని ఆన్లైన్ లో నిర్వహించాలని చెప్పింది అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ కమిటీ సిఫార్సులను అమలు చేయకపోతే మరి ఆ కమిటీని ఎందుకు వేసినట్లు అని శ్రీనివాస్ ప్రశ్నించారు.వేలకోట్ల రూపాయలు సొమ్ము చేసుకోవడానికే రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదు.పేపర్ లీక్ పై నైతికంగా బాధ్యత వహిస్తూ ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్,కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.భాజపా ప్రభుత్వం విద్యాను వ్యాపారంగా మార్చి విద్యార్థులను లాభం కోసం వినియోగించే పరిస్థితిని తీసుకువచ్చింది.ప్రశ్న పత్రం లీకు వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకొని కఠినంగా శిక్షించాలి మళ్ళీ ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.వెంటనే పరీక్ష తేదీలను ప్రకటించి విద్య సంవత్సరం (అకడమిక్ క్యాలెండర్) కు ఇబ్బంది లేకుండా పరీక్ష ను పకడ్బందీగా నిర్వహించాలని కోరుతున్నామన్నారు.ఈ ధర్నాలో బిఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

### నెల్లూరు పెన్నా బ్రిడ్జి సమీపంలో

# ఘోర రోడ్డు ప్రమాదం

**- వ్యక్తి మృతి**



పెన్నా బ్రిడ్జ్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. లారీ ఒక బైక్ ను ఢీ కొట్టిన ఈడ్చుకెళ్లి డివైడర్ ను ఢీ కొని డివైడర్ మధ్యలో వున్న పోల్ ను ఢీ కొట్టి ఆగింది. ఘటనలో లారీ కింద బైకు ఇరుక్కు పోయింది. ద్విచక్ర వాహన దారుడి శరీరం చిద్రం అయిపోయింది. గుర్తు పట్టలేని విధంగా మాసం ముద్ద లా మారింది.

### వైభవంగా రిషికేష్ శ్రీ చంద్రమౌళీశ్వరస్వామివారి

# వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరుపతి,** హిమాలయ పర్వత శ్రేణుల నడుమ పవిత్ర గంగాతీరాన వెలసిన రిషికేష్ ఆంధ్రాశ్రమంలోని శ్రీ చంద్రమౌళీశ్వరస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. మే 12న ప్రారంభమైన ఈ ఉత్సవాలు మే 16వ తేదీ వరకు ఘనంగా నిర్వహించబడనున్నాయి. ఇందులో భాగంగా మే 15న జరిగే స్వామివారి కల్యాణోత్సవానికి ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు.బ్రహ్మోత్సవాలలో భాగంగా మే 13న ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చి ఆధ్యాత్మికానందాన్ని పంచారు. మే 14న ఉదయం శేషవాహనం, రాత్రి గజవాహన సేవలు నిర్వహించనున్నారు.మే 15న ఉదయం సింహవాహన సేవ అనంతరం రాత్రి శ్రీ స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరుగనుంది. అనంతరం వృషభవాహన సేవ నిర్వహిస్తారు. మే 16న ఉదయం త్రిశూలస్నానం, తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, రావణాసుర వాహన సేవలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.మే 15న కల్యాణోత్సవంబ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన కల్యాణోత్సవం మే 15న సాయంత్రం 4.30 గంటలకు జరుగనుంది. గృహస్తులు (ఇద్దరు) రూ.501/- టికెట్ కొనుగోలు చేసి ఈ దివ్యోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందవచ్చు.ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహిస్తూ భక్తులను అలరిస్తున్నారు.

# యుద్ధప్రాతిపదికన బ్రిడ్జ్ పనులు పూర్తి..

- అండర్ బ్రిడ్జ్ కింద వాహనాల రాకపోకలు పునఃప్రారంభం...
- అధికారులను సత్కరించిన పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా...



**రేణిగుంట** తిరుపతి జిల్లా రేణిగుంట మండల కేంద్రంలో గత నెల రోజులుగా సాగుతున్న వాహనదారుల కష్టాలకు ఎట్టకేలకు తెరపడింది. రైల్వే అండర్ బ్రిడ్జ్ మరమ్మతుల కారణంగా మూసివేయడంతో, రేణిగుంట పట్టణంలోకి రావాలంటే వాహనదారులు పాత రోడ్డు లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాల్సి వచ్చేది. అయితే ఆ మార్గాల్లో రోడ్లన్నీ గుంతలమయమై, ప్రయాణం నరకప్రాయంగా మారిందని అటు స్థానికులు, ఇటు తిరుమలకు వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ట్రాఫిక్ కష్టాలపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు పూర్తయి, తాజాగా అండర్ బ్రిడ్జ్ పునఃప్రారంభమైంది.?శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి కృషితోనే ఈ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తయ్యాయని టీడీపీ నాయకులు కొనియాడారు. ప్రజలు, భక్తులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులకు, కాంట్రాక్టర్లకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. సుధీర్ రెడ్డి చొరవ వల్లే నెల రోజులుగా పడుతున్న కష్టాల నుండి వాహనదారులకు విముక్తి లభించిందని వారు తెలిపారు.ఈ సందర్భంగా రేణిగుంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ.. తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజా సౌకర్యాలకే తొలి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తాము అధికారులతో, కాంట్రాక్టర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనులు త్వరగా పూర్తయ్యేలా చూశామన్నారు. అనంతరం, ప్రజా సమస్యను గుర్తించి సానుకూలంగా స్పందించి పనులు పూర్తి చేసిన అధికారులను మహబూబ్ బాషా మరియు ఇతర నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించి, వారి సేవలను కొనియాడారు.?ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్, ఎంపీడీవో రవిచంద్ర, సిఐ జయచంద్ర, రేణిగుంట మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ నాయకులు డి.పి. పుష్పనాథం, ముస్లిం మైనార్టీ నాయకులు నవాబు, యువ నాయకుడు విద్యాసాగర్, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అండర్ బ్రిడ్జ్ తెరుచుకోవడంతో వాహనదారులు, పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

# బాధిత కుటుంబాలకు బొజ్జల సుధీర్ రెడ్డి పరామర్శ





**రేణిగుంట** శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బుధవారం రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు.?తిమ్మయ్యగుంటలో నివాళిముందుగా రేణిగుంట మండలం, వెంకటాపురం పంచాయతీ పరిధిలోని తిమ్మయ్యగుంట గ్రామానికి వెళ్లిన సుధీర్ రెడ్డి, సీనియర్ నాయకులు మాధవరెడ్డి కోడలు దివంగత గాయత్రి రెడ్డి కర్మక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు. గాయత్రి రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన, మాధవరెడ్డి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకు న్నారు.సుధాకర్ రెడ్డి కుటుంబానికి ధైర్యంఅనంతరం ఏర్పేడు మండలం, చిన్న అంజిమేడు గ్రామం లో దివంగత చిత్తానూరు సుధాకర్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుధాకర్ రెడ్డి మరణం తీరని లోటని పేర్కొంటూ, పుట్టెడు దుఃఖంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

# శ్రీశైలం ఆలయం లో శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) లోక కల్యాణం కోసం దేవస్థానం ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది. కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితిరోజులు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేషఅభిషేకం పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారి సేవగా నిర్వహించబడుతున్నాయి. ఈ ఉదయం సాక్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి.వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది.కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది.భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

# శ్రీవాణి దర్శన టికెట్లపై అపోహాలను నమ్మకండి

## భక్తులకు టీటీడీ విజ్ఞప్తి



తిరుపతి (ప్రశ్న న్యూస్) ఇటీవల కొన్ని పత్రికలు, సోషల్ మీడియా వేదికల్లో శ్రీవాణి ట్రస్టు టికెట్ల బుకింగ్‌కు సంబంధించి వస్తున్న వార్తల నేపథ్యంలో భక్తులు అపోహలకు గురికావద్దని టీటీడీ విజ్ఞప్తి చేసింది.టీటీడీ శ్రీవాణి ట్రస్టు టికెట్ల బుకింగ్ విధానాన్ని 2019 మే నెలలో ప్రవేశపెట్టింది. అప్పటి నుండి భక్తులు మధ్యవర్తుల ద్వారా టికెట్లు బుక్ చేసుకోవడం జరుగుతోంది.అందులోని లోటుపాట్లను భక్తుల నుండి వచ్చిన సూచనలు, సలహాల మేరకు 2024 సంవత్సరం జూన్ నుండి భక్తులకు పారదర్శకంగా, సురక్షితంగా సేవలు అందించేందుకు శ్రీవాణి టికెట్ బుకింగ్ విధానాన్ని అత్యంత పటిష్టంగా రూపొందించడం జరిగింది.శ్రీవాణి టికెట్ బుకింగ్ సైట్‌ను హ్యాక్ చేయడం లేదా వ్యవస్థలో చొరబడటం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదు. భక్తులు అపోహలకు గురి కావద్దు. అయితే కొందరు దళారులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ఏఐ ఆధారిత ఆటో ఫిల్లింగ్, ఆటో కాపీయింగ్ వంటి పద్ధతుల ద్వారా వేగంగా వివరాలు నమోదు చేసి టికెట్లను బుక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు.ఇలాంటి అనుమానాస్పద కార్యకలాపాలను టీటీడీ సాంకేతిక విభాగం ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత ఐడీలు అక్రమ బుకింగ్ విధానాలను వెంటనే నిరోధించి తదనుగుణంగా సాఫ్ట్ వేర్ ను కూడా ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ నిరంతర నిఘా ఉంచడం జరుగుతోంది.అదేవిధంగా కొంతమంది దళారులు భక్తులను తప్పుదోవ పట్టించి నకిలీ టికెట్లను విక్రయిస్తున్న నిందితులపై కూడా టీటీడీ కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోంది.అదేవిధంగా అడ్వాన్స్ బుకింగ్ సాఫ్ట్ వేర్ ను ముందు వచ్చిన వారికి ముందు బుక్ చేసుకునే విధానంలో అభివృద్ధి చేయడం జరిగింది. బుకింగ్ సమయంలో ఏదైనా కారణంగా టికెట్ బుక్ కాకపోయినా లేదా నగదు చెల్లింపులో లోపం తలెత్తితే వెంటనే ఆ టికెట్లు భక్తులకు అందుబాటులోకి వచ్చేలా ఈ అప్లికేషన్ పని చేస్తోంది. భక్తులు కేవలం అధికారిక టీటీడీ వెబ్‌సైట్ అధికారిక మార్గాల ద్వారానే టికెట్లు బుక్ చేసుకోవాలని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లా కౌన్సిల్ మెంబర్ శేఖర్ యాదవ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన వడ్ల ప్రభాకర్ స్వరూప ప్రథమ కుమారుడి వివాహ సందర్భంగా ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో వివాహం కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన బిజెపి పార్టీ మెదక్ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన వధూవరులు మీ పండంటి కాపురాని నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో హాయిగా జీవించాలని ఆశీర్వదించారు ఈ వివాహ కార్యక్రమంలో పాల్గొన్న ఎంబరి శేఖర్ యాదవ్, నాగులాగారి దుర్గా గౌడ్ జర్నలిస్టు నాగరాజుగౌడ్ వడ్ల సంతోష్ కుమార్, వడ్ల చంద్రశేఖర్, వడ్ల బ్రహ్మాచారి, అల్లిపురం భాను కుమార్, అల్లిపురం రవి, అక్కిం పాపయ్య, అక్కే మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలకు పోలీసుల కఠిన చర్యలు

**- గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్**

**- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : వీరప్రసాద్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. వీరప్రసాద్ తెలిపారు. శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన తనిఖీల్లో చెట్టిపల్లి కళ్యాణి(34) ఇంటి నుంచి 60 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విచారణలో సిరిసిల్లకు చెందిన దేవేందర్ వద్ద గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు ఆమె ఒప్పుకుందని తెలిపారు. ఇద్దరిపై ఎన్డిపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఐ బి. రామ్మోహన్‌తో పాటు మహిళా కానిస్టేబుల్ లత,కానిస్టేబుళ్లు పంతులు, ఎం. రమణారెడ్డి, సమీయుద్దీన్ పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ

**- ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ - ముఖ్యమంత్రితో భేటీ అయిన ఉబెర్ సీఈఓ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఉబెర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. బుధవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను దారా ఖోస్రోషాహి వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తి చూపుతున్నట్లు దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు.మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదని ఆయన తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్ల ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది.హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు.శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు.ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (జదీూ) మధు కన్నన్, ఉబెర్ ఇండియా ః సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో భక్తులకు వేగవంతంగా శ్రీవారి దర్శనం: టిటిడి

**సమన్వయ చర్యలతో మరింత సమర్థవంతంగా క్యూ లైన్ల నిర్వహణ**

**డిజిటల్ మానిటరింగ్‌తో రద్దీ భారీగా ఉన్నా భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం**

**భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా నారాయణగిరి షెడ్ల నుండి క్యూలైన్లు బయటకు రాకుండా సమగ్ర చర్యలు**



తిరుమల (ప్రశ్న న్యూస్)వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరుగుతున్నప్పటికీ టీటీడీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు సమర్థవంతమైన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కీలకపాత్ర పోషిస్తోంది.తిరుమలలోని క్యూ కాంప్లెక్స్‌లు, నారాయణగిరి షెడ్లు, అన్నప్రసాద కేంద్రాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ పరిసరాలు తదితర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వందల సంఖ్యలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా భక్తుల కదలికలు, రద్దీ తీవ్రత, క్యూ లైన్ల ప్రవాహం వంటి అంశాలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ తక్షణ నిర్ణయాలు తీసుకుంటున్నారు.భక్తులు ఏ ప్రాంతంలో ఎక్కువసేపు వేచి ఉండకుండా క్యూ లైన్లను సమతుల్యం చేయడం, అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించడం, తాగునీరు, పాలు, అన్నప్రసాదం, వైద్య సేవలు వేగంగా అందించడం వంటి చర్యలు సమన్వయంతో కొనసాగుతున్నాయి. దీంతో దర్శన సమయ నియంత్రణలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోంది. ప్రత్యేకించి నారాయణగిరి షెడ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లలో భక్తుల రద్దీని డిజిటల్ మానిటరింగ్ ద్వారా అంచనా వేసి, దానికి అనుగుణంగా భక్తులను విడతల వారీగా ముందుకు పంపించే విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని వల్ల భక్తులు ఇబ్బందులకు గురికాకుండా సాఫీగా దర్శనానికి చేరుకుంటున్నారు.టీటీడీ అమలు చేస్తున్న ఆధునిక రద్దీ నిర్వహణ విధానాల వల్లే క్యూలైన్లలో భక్తుల రద్దీ తక్కువగా కనిపిస్తోంది. గతంలో మాదిరిగా భక్తులు గంటల కొద్దీ క్యూలైన్లలో నిలిచిపోయే పరిస్థితులు లేకుండా, సాంకేతిక ఆధారంగా టీటీడీ యంత్రాంగం సమన్వయంతో భక్తులను వేగంగా దర్శనానికి పంపిస్తున్నారు. టీటీడీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగిస్తూ భక్తులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా టీటీడీ అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా పనిచేస్తున్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, పరిశుభ్రత, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు భక్తుల సహకారంతో తిరుమలలో దర్శన వ్యవస్థ మరింత సాఫీగా కొనసాగుతోంది.

ప్రస్తుతం వేసవి రద్దీ నేపథ్యంలో శని, ఆదివారాల్లో దాదాపు 85 వేలమందికి పైగా భక్తులకు దర్శనం చేయించడం జరుగుతోంది. అదేవిధంగా సాధారణ రోజుల్లో దాదాపు 75వేల మంది భక్తులకు పైగా దర్శనం చేసుకునేందుకు టీటీడీ యంత్రాంగం విశేషంగా కృషి చేస్తోంది. మే 2వ తేదిన అత్యధికంగా 91,005 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోవడం విశేషం.

# బక్రీద్ పండుగ నేపథ్యంలో తూప్రాన్ టోల్ గేట్ చెక్ పోస్టును తనిఖీ చేసిన

## జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అప్రమత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తూప్రాన్ టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టును ఆయన స్వయంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పండుగ నేపథ్యంలో జిల్లా సరిహద్దుల గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే అనుమానాస్పద వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అలాగే చెక్ పోస్టుల వద్ద ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువుల రవాణా తనిఖీల్లో సమన్వయం కోసం వెటర్నరీ సిబ్బంది కూడా నిరంతరంఅందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాత్రి సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది వాహనాల తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ట్రాఫిక్ బ్యాటన్స్ మరియు రిఫ్లెక్టివ్ జాకెట్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే ప్రజలు వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలి. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.

# మెట్ పల్లి న్యాయవాదుల ప్రేమాభిమానాలు మరువలేనివి

**- సీనియర్ సివిల్ జడ్జి - నాగేశ్వరరావు**




మెట్ పల్లి (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా,మెట్‌పల్లి నుంచి జగిత్యాలకు బదిలీ అయిన సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మెట్‌పల్లిలో 20 నెలల సేవాకాలంలో న్యాయవాదులు చూపిన ప్రేమాభిమానాలు జీవితాంతం మరిచిపోలేనివని అన్నారు. విధి నిర్వహణలో ఎవరినైనా నొప్పించి ఉంటే క్షమించాలని కోరారు. అనంతరం న్యాయవాదులు శాలువాతో సన్మానించి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్యా రాజారాం, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రామ్ రెడ్డి, తోట ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, ఎపిపిలు చెర్లపల్లి ఆనంద్ గౌడ్, జి. ప్రణయ్, ఎజిపి అబ్దుల్ హఫీజ్, న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు, వడ్డేపల్లి శ్రీనివాస్, కుమారం శ్రీనివాస్, గంద్ర ప్రవీణ్ రావు, కంతి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అవతార్-3

## – ఓటీటీ స్ట్రీమింగ్ కు రెడీ!




జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన అవతార్-3 ఫైర్ అండ్ యాష్ గత ఏడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సినిమా త్వరలో అంతర్జాతీయ ఓటీటీలోకి రానుంది. డిస్నీప్లస్ వేదికగా జూన్ 24వ తేదీన ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుందని వెల్లడిస్తూ, నిర్మాణ సంస్థ పోస్టర్‌ను విడుదల చేసింది. అవతార్-3 చిత్రం థియేటర్లలో మంచి వసూళ్లను రాబట్టింది. వాస్తవానికి ఈ చిత్రం ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో రెంటల్ ప్రాతిపదికన అందుబాటులో ఉంది. జూన్ 24వ తేదీ నుంచి సబ్‌స్క్రిప్షన్ ఉన్న వినియోగదారులకు ఎలాంటి అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా సినిమాను వీక్షించవచ్చు.అవతార్-3 భారతదేశంలో జూన్ 24వ తేదీనే జియో హాట్‌స్టార్‌లో అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. తెలుగు, హిందీ, తమిళం తదితర భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. భారతదేశంలో ఈ సినిమా ఓటీటీ విడుదలపై ప్రకటన రావాల్సి ఉంది.

# మన 'ధురంధర్'కు కౌంటర్ గా పాకిస్థాన్ 'మేరా ల్యారీ'...

## 22 టికెట్లకే థియేటర్ల నుంచి ఎత్తేశారు!




భారత సినిమాకు దీటుగా సమాధానం చెప్పాలనే లక్ష్యంతో పాకిస్థాన్‌లో రూపొందించిన ఓ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘోరంగా విఫలమైంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలోని భారత చిత్రం 'ధురంధర్'కు ప్రతిస్పందనగా వచ్చిన 'మేరా ల్యారీ' అనే ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి కనీస ఆదరణ కూడా లభించలేదు. కొన్ని థియేటర్లలో కేవలం 22 టికెట్లు మాత్రమే అమ్ముడయ్యాయని, దీంతో షోలను రద్దు చేసి సినిమాను ప్రదర్శనల నుంచి తొలగించారని పాక్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. కరాచీలోని ల్యారీ ప్రాంతాన్ని ఉగ్రవాద కార్యకలాపాలతో ముడిపెట్టి భారత చిత్రం 'ధురంధర్'లో చూపించారని, దానికి భిన్నంగా ఆ ప్రాంత సానుకూల కోణాన్ని, ముఖ్యంగా మహిళల ఫుట్‌బాల్ క్రీడను ప్రపంచానికి పరిచయం చేసే ఉద్దేశంతో 'మేరా ల్యారీ'ని తెరకెక్కించారు. అబు అలీహా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అయేషా ఒమర్, దననీర్ మొబీన్, సామియా ముంతాజ్ వంటి ప్రముఖ నటీనటులు నటించారు. ఈ నెల 8న విడుదలైన ఈ సినిమా మొదటిరోజే తేలిపోయింది. ప్రేక్షకులు లేకపోవడంతో చాలా చోట్ల తొలిరోజే ప్రదర్శనలు నిలిపివేసి, దాని స్థానంలో ఇతర చిత్రాలను ప్రదర్శించినట్టు తెలుస్తోంది. విడుదలకు ముందు ఈ సినిమాకు పాకిస్థాన్‌లో రాజకీయ మద్దతు కూడా లభించింది. ఇది భారత్ నుంచి వస్తున్న ప్రతికూల ప్రచారానికి సమాధానం అని సింధ్ సమాచార శాఖ మంత్రి షర్జీల్ ఇనామ్ మెమన్ బహిరంగంగానే ప్రకటించారు. అంతేగాక ఈ ప్రాజెక్టుకు ఆయన మంత్రిత్వ శాఖ కొంతమేర మద్దతు కూడా ఇచ్చింది. సినిమాను వాస్తవికంగా చిత్రీకరించేందుకు 80 శాతం నటీనటులను ల్యారీ స్థానికులనే తీసుకున్నామని దర్శకుడు అబు అలీహా గతంలో తెలిపారు. భారత చిత్రం 'ధురంధర్' పాకిస్థాన్‌లో అధికారికంగా విడుదల కాకపోయినా, పైరసీ ద్వారా అక్కడి ప్రేక్షకులకు చేరింది. అందులో ల్యారీ ప్రాంతాన్ని నెగటివ్‌గా చూపించడంపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వచ్చిన 'మేరా ల్యారీ' చిత్రంపై మంచి అంచనాలే ఉన్నప్పటికీ, అవి బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపించడంలో పూర్తిగా విఫలమయ్యాయి. సానుకూల ప్రచారం, ప్రభుత్వ మద్దతు ఉన్నప్పటికీ ప్రేక్షకులు తిరస్కరించడం గమనార్హం.

# మళ్లీ యాక్టివ్ అయిన 'ఐబొమ్మ' వెబ్‌సైట్




టాలీవుడ్‌లో పైరసీ సమస్య మరోసారి తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. చాలా కాలంగా మూతపడినట్లు భావించిన 'ఐబొమ్మ' వెబ్‌సైట్ మళ్లీ ఆన్‌లైన్‌లో కనిపించడం సినీ పరిశ్రమలో కలకలం రేపుతోంది. థియేటర్లలో విడుదలైన కొత్త సినిమాలు కొన్ని గంటల్లోనే హై క్వాలిటీ ప్రింట్లతో ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తుండటంతో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ వెబ్‌సైట్ నిర్వహణలో కీలక పాత్ర పోషించాడన్న ఆరోపణలతో ఇమంది రవిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత 'ఐబొమ్మ' కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోయాయని భావించారు. అయితే ఇటీవల ఆయన బెయిల్‌పై బయటకు వచ్చిన కొద్ది రోజులకే వెబ్‌సైట్ మళ్లీ యాక్టివ్ కావడం అనుమానాలకు తావిస్తోంది. ఈ సైట్‌ను మళ్లీ ఎవరు ప్రారంభించారు? దీనిలో ఇమంది రవి పాత్ర ఏమైనా ఉందా? లేక మరో కొత్త గుంపు దీన్ని నిర్వహిస్తోందా? అనే అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం సైబర్ క్రైమ్ పోలీసులు ఈ వెబ్‌సైట్ వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించే పనిలో ఉన్నారు. సాంకేతికంగా డొమైన్‌లు మారుస్తూ, సర్వర్లు మార్చుకుంటూ ఈ తరహా పైరసీ వెబ్‌సైట్లు తప్పించుకుంటుండటంతో వాటిని పూర్తిగా అరికట్టడం అధికారులకు సవాల్‌గా మారింది.

సినిమా విడుదలైన కొద్ది గంటల్లోనే పైరసీ ప్రింట్లు బయటకు రావడం వల్ల నిర్మాతలకు భారీ ఆర్థిక నష్టం జరుగుతోందని సినీ పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఇక మరోవైపు థియేటర్ రంగం కూడా ఇప్పటికే తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఓటీటీ వేదికల ప్రభావం, ప్రేక్షకుల వీక్షణ అలవాట్ల మార్పు కారణంగా థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గుతోంది. ఈ పరిస్థితుల్లో పైరసీ మరింత దెబ్బతీస్తోందని ఎగ్జిబిటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొంతమంది థియేటర్ యజమానులు రెంటల్ విధానానికి బదులుగా పర్సంటేజీ షేరింగ్ విధానం తీసుకురావాలని కోరుతున్నారు. సినిమా హిట్ అయితే లాభాలు, ఫ్లాప్ అయితే నష్టాలు నిర్మాతలు, ఎగ్జిబిటర్లు కలిసి పంచుకోవాలన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పైరసీ, థియేటర్ల ఆర్థిక సమస్యలు రెండూ కలిసి తెలుగు సినిమా పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ సమస్యలను అరికట్టేందుకు కఠిన చట్టాలు, సాంకేతిక చర్యలు, వేగవంతమైన అమలు అవసరమని ఇండస్ట్రీ వర్గాలు కోరుతున్నాయి.

# రమణీ కల్యాణం కడు రమణీయం



సూర్య వశిష్ట, దీప్షిక జంటగా నటిస్తున్న ఎమోషనల్ డ్రామా 'రమణి కళ్యాణం'. విజయ్ ఆదిరెడ్డి స్వీయ దర్శకత్వంలో మనోజ్ చింతిరెడ్డి, శ్రీనాథ్ పసుపులేటి, సంజయ్ వెంపరాలతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రచారంలో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో సినిమా టీజర్‌ని విడుదల చేశారు. సహజనటి జయసుధ టీజర్‌ని లాంచ్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'కథను నమ్మి చేసిన సినిమా ఇది. హీరోహీరోయిన్లు సహజంగా పాత్రల్లో ఒదిగిపోయి నటించారు. సాంకేతికంగా కూడా సినిమా ఆకట్టుకుంటుంది' అని దర్శక,నిర్మాత విజయ్ ఆదిరెడ్డి నమ్మకంగా చెప్పారు. అరుదుగా ఇలాంటి కథలు వస్తాయని, డైరెక్టర్ ప్రాణం పెట్టి సినిమాను తెరకెక్కించారని, ఇందులో ఛాలెంజింగ్ రోల్ చేశానని, ఫ్యామిలీ ఆడియన్స్‌కి నచ్చే క్లీన్ మూవీ ఇదని హీరో సూర్య వశిష్ట అన్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల కథానాయిక దీప్షిక చంద్రన్ ఆనందం వెలిబుచ్చారు. ఇంకా నిర్మాత శ్రీనాథ్ పసుపులేటి కూడా మాట్లాడారు.

# శంబాలా కాంబినేషన్ రిపీట్



'శంబాలా' విజయం తర్వాత అలాంటిదే మరో ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు చిత్ర నిర్మాతలు మహీధర్‌రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు. ఈ చిత్రానికి 'శంబాలా' చిత్ర దర్శకుడు యుగంధర్ ముని సమర్పకుడు. ఆది సాయికుమార్ కథానాయకుడు. బృందా రవీందర్ దర్శకత్వం వహించనున్నారు.'శంబాలా' తరహా ఫాంటసీ ఎలిమెంట్స్‌తోపాటు ఎమోషన్స్, హారర్ ఎలిమెంట్స్ కూడా ఈ కథలో తోడయ్యాయని, భయం, ఉత్కంఠతో కూడిన అన్ లిమిటెడ్ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ చెబుతున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్‌లో ఆది సాయికుమార్ ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్నారు. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడి కాను న్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, నిర్మాణం: షైనింగ్ పిక్చర్స్.

# 'ది ప్యారడైజ్' రీషూట్ వార్తలపై మేకర్స్ క్లారిటీ..

ఈ సినిమా రీషూట్‌ల వల్ల ఆలస్యం అవుతోందంటూ సోషల్ మీడియాలో గత కొన్ని రోజులుగా వార్తలు వస్తుండగా.. ఈ వార్తలపై నిర్మాణ సంస్థ ఎస్‌ఎల్‌వీ సినిమాస్ స్పందిస్తూ.. 'ది ప్యారడైజ్'పై జరుగుతున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించింది. ఇప్పటివరకు 100 రోజులకు పైగా షూటింగ్ ఎంతో పక్కా ప్రణాళికతో పూర్తయిందని, ఒక్క సీన్ కూడా రీషూట్ చేయలేదని మేకర్స్ స్పష్టం చేశారు. అంతేకాకుండా, భవిష్యత్తులో కూడా రీషూట్‌లు చేసే ప్రసక్తే లేదని, సినిమా అవుట్‌పుట్ పట్ల తాము పూర్తి సంతృప్తితో ఉన్నామని వెల్లడించారు. ఇప్పటికే విడుదలైన 'ఆయ షేర్' సాంగ్ సృష్టించిన ప్రభంజనం సినిమాపై అంచనాలను భారీగా పెంచగా, షెడ్యూల్ ప్రకారమే షూటింగ్ శరవేగంగా జరుగుతోందని వారు ధృవీకరించారు. సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే ఈ ఇంటెన్స్ యాక్షన్ డ్రామాలో నాని ముక్కుపుడక, లాంగ్ హెయిర్‌తో పూర్తి భిన్నమైన గెటప్‌లో కనిపిస్తుండగా, మోహన్ బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ భారీ చిత్రాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా ముందే ప్రకటించిన విధంగా ఆగస్టు 21, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తామని మేకర్స్ క్లారిటీ ఇవ్వడంతో నాని అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# బోయినిపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్-6 విజేతగా గుంటి శంకర్ వారియర్స్

**- క్రీడా స్ఫూర్తితో సాగిన బిపిఎల్ టోర్నమెంట్**

**- విజేత జట్లకు కప్పులు అందజేసిన ప్రజాప్రతినిధులు**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలో గత 15 రోజులుగా నిర్వహించిన బోయినిపల్లి ప్రీమియర్ లీగ్ (బీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ సీజన్-6 ముగింపు సందర్భంగా ఫైనల్ మ్యాచ్‌లో గుంటి శంకర్ వారియర్స్ జట్టు, మధు 11 జట్టు తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన పోటీలో గుంటి శంకర్ వారియర్స్ విజేతగా నిలవగా, మధు 11 జట్టు రన్నరప్‌గా నిలిచింది.
ముగింపు కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, డాక్టర్ చెన్నాడి అమిత్,గుంటి శంకర్,ఉప సర్పంచ్ పొత్తూరి శైలజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, యువ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. విజేత జట్లకు కప్పులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# అప్పాల శ్రీనివాస్ మాతృమూర్తి మృతి పట్ల ముత్యాల సునీల్ కుమార్ సంతాపం



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా,భీంగల్ మండలం,జాగిర్యాల్ గ్రామానికి చెందిన ఓ దినపత్రిక మండల పాత్రికేయులు అప్పాల శ్రీనివాస్ మాతృమూర్తి రాజవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాజవ్వ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రజాప్రతినిధుల సహకారం అవసరం : ఏఎస్ఓ నర్సింలు




గజ్వేల్ (ప్రశ్న న్యూస్) ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తోందని విద్యాశాఖ ఏ ఎస్ ఓ నర్సింలు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐవసి కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏ ఎస్ఓ నర్సింలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, భోజన సౌకర్యాలు అందిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ప్రతి విద్యార్థి వ్యక్తిగత నైపుణ్యాలు పెంపొందించే విధంగా బోధన జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వ బడుల అభివృద్ధి కోసం స్థానిక ప్రజాప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. గ్రామాల్లోని విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఉపాధ్యాయులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## వైభవంగా రిషికేష్ శ్రీ చంద్రమౌళీశ్వరస్వామివారి

# వార్షిక బ్రహ్మోత్సవాలు

**మే 15న వైభవోపేతంగా కల్యాణోత్సవం**



రిషికేష్ (ప్రశ్న న్యూస్) హిమాలయ పర్వత శ్రేణుల నడుమ పవిత్ర గంగాతీరాన వెలసిన రిషికేష్ ఆంధ్రాశ్రమంలోని శ్రీ చంద్రమౌళీశ్వరస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. మే 12న ప్రారంభమైన ఈ ఉత్సవాలు మే 16వ తేదీ వరకు ఘనంగా నిర్వహించబడనున్నాయి. ఇందులో భాగంగా మే 15న జరిగే స్వామివారి కల్యాణోత్సవానికి ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహిస్తూ భక్తులను అలరిస్తున్నారు.

# ప్రభుత్వ కళాశాలలు నాణ్యమైన విద్యకు చిరునామాలు

**స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంథని.**






మంథని ( ప్రశ్న న్యూస్) మంథని "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" విద్యా వారోత్సవాల మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా డిగ్రీ కళాశాల పరిధిలో గల మల్లేపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామపంచాయతీ ఆఫీసు వద్ద గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు యువజనలతో సమావేశమై కళాశాలలో గల వసతులను కళాశాల అందజేస్తున్న కోర్సుల వివరాలను, మరీ ముఖ్యంగా కొత్తగా ప్రవేశపెట్టిన ఏ ఈ డి పి కోర్సుల ప్రయోజనాలను గ్రామస్తులకు వివరిస్తూ, ప్రభుత్వ కళాశాలు నాణ్యమైన విద్యకు చిరునామాలు అని మీ పిల్లల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దడానికి అన్ని సౌకర్యాలను ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందని వాటిని ఉపయోగించుకోవాలని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ చాట్ల పరిషయ్య పేర్కొన్నారు. కళాశాల ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ కర్నాటి కృష్ణ మాట్లాడుతూ కళాశాలలో కేవలం పాఠ్యపుస్తకాల బోధనే కాకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కై అనేక రకాలైన సదస్సులను, వర్కు షాపులను నిర్వహిస్తుందని, శారీరక దృఢత్వానికై క్రీడలను, మానసిక ఉల్లాసానికై సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుందని, అదే విధంగా నైపుణ్యాభివృద్ధికి రాష్ట్రస్థాయిలో నిర్వహించే జిజ్ఞాస వంటి కార్యక్రమాలకు విద్యార్థులను ప్రోత్సహిస్తుందని, ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూపాయలు 25 వేల వరకు నగదు బహుమతులు పొందవచ్చునని తెలియజేశారు.

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆడెపు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కళాశాలలోని జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాల ద్వారా సామాజిక అవగాహన, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చునని తెలియజేస్తూ మీ పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు. గ్రామ సర్పంచ్ లక్కాకుల సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాలలో గల సౌకర్యాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ కళాశాలలో విద్యార్థుల చేర్పునకు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఎరుకల రాయమల్లు, వార్డు సభ్యులు గుర్రాల ప్రశాంత్, గోశిక సునీత, కొవ్వూరి శైలజ, బూడిద సందీప్, ఎస్.కె షకిల్, కరోబార్ జై శంకర్ గ్రామ పెద్దలు ముసుకుల రాజిరెడ్డి, ముసుకుల సత్యనారాయణ, కళాశాల అధ్యాపక బృందం సతీష్, ముకుందం, శేఖర్, కృష్ణ, శ్రీధరాచార్యులు, రాజు, సురేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రత్యేక అధికారులు బాధ్యతగా పని చేయాలి

**వేసవిలో త్రాగునీటి కొరత రాకుండా శ్రద్ధ చూపాలి**

**గ్రామాల్లో సమస్యల పరిష్కారం, సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలి**

**అవనిగడ్డ ప్రజా దర్బార్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**



అవనిగడ్డ(ప్రశ్న న్యూస్) పంచాయతీ బాధ్యతలు చేపట్టిన గ్రామ ప్రత్యేక అధికారులు శ్రద్ధగా పని చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. బుధవారం అవనిగడ్డలోని రెవిన్యూ హాలులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఆయనకు ప్రజలు తమ గ్రామాల్లోని సమస్యలు, వ్యక్తిగత సమస్యలపై అర్జీలు సమర్పించారు. వాటిని ఎమ్మెల్యే పరిశీలించి అధికారులతో చర్చించి పరిష్కారాలు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ ప్రత్యేక అధికారుల పని తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలని సూచిస్తే ఎంతమంది ప్రతిపాదనల నివేదికలు ఎంతమంది సమర్పించారని ప్రశ్నించారు. ప్రత్యేక అధికారులకు చేతకాకపోతే తప్పుకోండి. వేరేవారిని నియమిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులపై ఉన్న గురుతర బాధ్యతను ఖచ్చితంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారులు ఇప్పటికైనా స్పందించి పని చేయాలని చివరిగా చెబుతున్నానని, గ్రామాలకు తాను వెళ్ళినపుడు సమస్యలు తన దృష్టికి వస్తే సహించేది లేదన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో త్రాగునీటి కొరత లేకుండా, ప్రస్తుత సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని సూచించారు. పైప్ లైన్ లీకేజీలు అరికట్టాలని, అక్రమ మోటార్లతో చివరి ప్రాంతాలకు త్రాగునీరు అందని లైన్లకు త్రాగునీటి సరఫరా సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో కీలకమైన డ్రైనేజీలను వేసవిలోపు పూడిక తీయించాలని, స్ట్రీట్ లైట్ల కాంతి పెరిగేందుకు తగిన లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అవనిగడ్డలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో నుంచి వర్షపు నీరు బయటకు పోయేందుకు ఆటంకంగా పరిణమించిన ఆక్రమణలు తొలగించి, వర్షపు నీరు, మురుగు నీటి పారుదల క్రమబద్ధీకరించాలని స్పష్టం చేశారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిర్మించబోయే సీసీ రోడ్లు ఎక్కువ కుటుంబాలకు ఉపయోగపడే అంతర్గత రహదారులను ఎంపిక చేయాల్సిన బాధ్యతను పంచాయతీరాజ్ అధికారులు నిర్వర్తించాలని సూచించారు. ఆర్.డబ్ల్యు.ఎస్ శాఖ అధికారులు త్రాగునీటి సరఫరాపై గ్రామాల ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవిలో త్రాగునీటి ఇబ్బంది రాకుండా శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల వెంట ఆక్రమణలు తొలగించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఇంచార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ మరియాదేవి, ఎక్సైజ్ శాఖ సీఐ పీ.గిరిజ, డీఈఈ ఎం.రమేష్,

# ఉచిత క్రికెట్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

**క్రీడలు మానసిక ఉల్లాసానిస్తాయి**

**బియువత డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి**

**బిగజ్వేల్ సీఐ రవికుమార్ పిలుపు**




గజ్వేల్(ప్రశ్న న్యూస్) క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ముఖ్యంగా క్రికెట్ వంటి జట్టు క్రీడలు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని గజ్వేల్ సీఐ రవికుమార్ అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ మైదానంలో నిర్వహిస్తున్న ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గజ్వేల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, కార్యదర్శి బాకీ స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు కొనసాగే ఈ శిబిరంలో యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ ఇటీవల యువత మొబైల్ ఫోన్లకు అధికంగా అలవాటు పడి అనారోగ్యాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించి క్రీడల పట్ల ఆసక్తి పెంచాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన క్రీడా ప్రతిభ ఉందని, భవిష్యత్తులో మంచి క్రికెట్ క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతో హరిప్రసాద్, బాకీ స్వామి ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే యువత డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఆరోగ్యంతో పాటు తమ భవిష్యత్తును కూడా కాపాడుకోవాలని సూచించారు.

# పుష్కరాలకు సమగ్ర క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి

**అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా కార్యాచరణ**

**రాజమహేంద్రవరం--కొవ్వూరు సమాన అభివృద్ధే లక్ష్యం :జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**



రాజమహేంద్రవరం (ప్రశ్న న్యూస్) గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమగ్ర క్రౌడ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (సి యూ ఎం టీ ఎ) బృందంతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బృంద సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదేశాల మేరకు పుష్కరాలకు ముందస్తుగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి ముందస్తు ప్రణాళికల వల్ల పుష్కరాల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పుష్కరాల సమయంలో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, అత్యవసర సేవలు, ఘాట్‌ల నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ అవసరమన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో రియల్‌టైమ్ క్రౌడ్ మేనేజ్‌మెంట్ అమలు చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గోదావరి పుష్కరాలు సమయంలో ఐదు ప్రధాన రోజుల్లో కోటి మందికి పైగా భక్తులు పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అన్ని ఘాట్‌లను "పుష్కర ఘాట్‌లు"గా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కోటిలింగాల ఘాట్ వంటి విశాల ప్రదేశాలను ఎక్కువ మంది భక్తులు వినియోగించు కునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అందుకు అనుగుణంగా మళ్లింపు టెక్నాలజీ ఆచరణ లో చూపాలని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, ప్లాస్టిక్ రహిత పుష్కరాల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పూజా సామాగ్రిని గోదావరిలో వేయకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

# శిశు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు

**జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) ఆడ శిశువును 3 లక్షలకు అమ్మిన తల్లి తండ్రులు కూల్చరం మండలం పోతిరెడ్డిపల్లి తాండకు చెందిన దంపతులు తమ 4 వ శిశువును అమ్ముకున్నారనే విషయం మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టడం జరిగినది. ఇట్టి విచారణలో కన్న తల్లి తండ్రులు తమ పాపను 3 లక్షలకు అమ్ముకున్నారని నిర్ధారించుకుని సంబంధిత పోలీస్ స్టేషన్ లో తగు చర్యల కొరకై పిర్యాదు చేయడం జరిగినది. ఇట్టి విచారణలో తెలిసినది కూల్చరం మండలం పోతిరెడ్డిపల్లి తాండకు చెందిన దంపతులకు ఇదివరకే 3 సంతానం ఉండగా తేదీ 27.3.2026 నాడు మెదక్ లోని వీజన ఎశీంజూఫ్ఘశ్రీ లో ఆడ పాప జన్మించడం జరిగినది. పాపను దంపతులిద్దరూ 3 లక్షలకు కొంత మంది మధ్యవర్తుల ద్వారా అల్లినగర్, ములుగు మండలం సిద్దిపేట జిల్లాకు చెందిన దంపతులకు విక్రయించడం జరిగించడం జరిగినది. ఇట్టి విషయం పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి పాపను తీసుకువచ్చి మహిళా శిశు సంక్షేమ అధికారులకు అప్పగించడం జరిగినది అధికారులు సంబంధిత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు పాపను తదుపరి సంరక్షణ నిమిత్తం సంగారెడ్డి లోని శిశుగృహ కు తరలించి ఆశ్రయం కల్పించడం జరిగినది. జిల్లాలో అక్రమ దత్తత తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియచేస్తూ, ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవలంటే ప్రభుత్వ నియమ నిభందనల ప్రకారం మహిళా శిశు సంక్షేమ శాఖ లోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం

# అక్రమ నిర్మాణాలను సీజ్ చేసిన కాప్రా సర్కిల్ ఏసిపి

- అక్రమ నిర్మాణాలు చేస్తే సహించేది లేదు ఏసిపి కృష్ణమూర్తి
- ఎవరి మాటలు నమ్మి డబ్బులు ఖర్చు చేసుకోకండి, చట్టప్రకారం నిర్మించుకోండి
- ఇంకా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై ఎప్పుడు పూర్తి స్థాయి చర్యలు.?


ప్రజాప్రశ్న
వీళ్ళ అవినీతిని కట్టడి చేసేది లేదా.?






కాప్రా (ప్రశ్న న్యూస్) కొంతమంది టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు అక్రమ నిర్మాణాలను లంచాలు తీసుకొని ప్రోత్సహించడంపై పలు పత్రికలో వచ్చిన కథనాలతో పాటు ప్రజా ప్రశ్న దిన పత్రికలో వరుసగా ప్రచురితమైన అక్రమ నిర్మాణాల కథనాలు ఎట్టకేలకు అధికార యంత్రాంగాన్ని కదిలించాయి. చర్లపల్లి డివిజన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న అక్రమ కట్టడాలపై ఏసీపి కృష్ణమూర్తి స్పందించి సుమారు నాలుగు భవనాలను సీజ్ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కాప్రా సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సంవత్సరాలుగా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తరుణంలో ప్రజాప్రశ్న దినపత్రిక కథనాలు కలకలం రేపాయి.

ఇటీవల చర్లపల్లి, ఏ ఎస్ రావు నగర్, మల్లాపూర్, నాచారం, పరిసర ప్రాంతాల్లో అనుమతులకు మించి అక్రమ అంతస్తులు నిర్మించడం, సెల్లార్లను వాణిజ్య అవసరాలకు మార్చడం, పార్కింగ్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించడం వంటి అక్రమాలు బహిరంగంగానే కొనసాగుతున్నాయి. అయినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

### నిర్మాణాలు చేస్తున్నప్పుడు మౌనం, ఫిర్యాదులు వస్తేనే కదలికలు




టౌన్ ప్లానింగ్ అధికారుల సిబ్బంది వ్యవహారం వింతగా ఉంటుంది. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే కదిలే అధికారులు నిర్మాణం ప్రారంభం జరుగుతున్నప్పుడే ఎందుకు అడ్డుకోవడం లేదు.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ప్రజాప్రశ్న దిన పత్రికలో కథనాలు వెలువడిన వెంటనే అధికారులు రంగంలోకి దిగి కొన్ని




భవనాలను సీజ్ చేయడం వెనుక అసలు కారణం ప్రజా ఒత్తిడేనని స్థానికులు చెబుతున్నారు. అయితే నాలుగు భవనాలను సీజ్ చేయడం మాత్రమే సరిపోదని కాప్రా సర్కిల్ మొత్తంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది రాజకీయ నాయకుల కనుసైగల్లో భారీ నిర్మాణాలు జరుగుతున్నాయని దీనికి అధికారి మద్దతు ఉండడం కూడా చర్చనీయంగా మారింది. అయితే ఏసీపీ కృష్ణమూర్తి అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించడంతో అవినీతి అధికారికి మింగుడు పడడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అక్రమ కట్టడాల వెనుక ఉన్న బిల్డర్లకు టౌన్ ప్లానింగ్ లో సెక్షన్ అధికారులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమ నిర్మాణాల మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

# మెట్టుగూడ సర్కిల్లో అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసీ ఉక్కుపాదం

- సీతాఫల్‌మండి, లాలాపేట్‌లో అక్రమ నిర్మాణాలు సీజ్
- బిల్డర్ల, అక్రమ నిర్మాణదారుల గుండెల్లో దడ
- సిబ్బంది, సెక్షన్ ఆఫీసర్ల కనుసైగల్లోనే జోరుగా అక్రమ నిర్మాణాలు
- నిర్మాణ ప్రారంభంలో అధికారులు నిద్రపోతారు, నిర్మాణం పూర్తి కావస్తుంటే నోటీసులు అంటారు
- టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులకు లక్షలలో లంచాలు







తార్నాక (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ భారీగా పెరుగుతున్న అక్రమ నిర్మాణాల దందాపై చివరకు జిహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం ఉక్కుపాదం మోపింది. మెట్టుగూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం రంగంలోకి దిగడంతో అక్రమ నిర్మాణాల నిర్వాహకుల్లో కలకలం రేగింది. సీతాఫల్‌మండి, లాలాపేట్ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న పలు భవనాలను అధికారులు సీజ్ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. సీతాఫల్‌మండి లోని వీరమాచినేని పాఠశాల వెనుక భాగంలో నిబంధనలకు విరుద్ధంగా వేగంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే తాజాగా స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో అసలు పరిస్థితి బయటపడింది. అనుమతుల పరిమితులను ధిక్కరించి అంతస్తుల మీద అంతస్తులు కట్టేస్తూ ప్రభుత్వ నిబంధనలను బహిరంగంగా తుంగలో తొక్కిన నిర్మాణదారులకు అధికారులు షాక్ ఇచ్చారు. లాలాపేట్ ప్రాంతంలో కూడా ఇదే తరహాలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను అధికారులు గుర్తించారు. అనుమతులు ఒకలా తీసుకుని నిర్మాణాలు మరోలా కొనసాగించడం, పార్కింగ్ స్థలాలను ఆక్రమించడం, సెట్‌బ్యాక్‌లు పూర్తిగా మింగేయడం వంటి అక్రమాలు వెలుగుచూశాయి. కొందరు బిల్డర్లు అధికార యంత్రాంగాన్ని సైతం లెక్కచేయకుండా మమ్ములను ఎవరేమి చేస్తారు.? అన్న ధోరణితో వ్యవహరించారని స్థానికులు మండిపడుతున్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ సిటీ ప్లానర్ సాయిబాబా, టీపిబిఓ సత్యవర్ధన్ సాగర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొని అక్రమ నిర్మాణాలను సీజ్ చేశారు. భారీ యంత్రాంగంతో నిర్వహించిన ఈ తనిఖీలు చూసి కొందరు బిల్డర్లు అక్కడి నుంచి పరారయ్యారనే ప్రచారం కూడా స్థానికంగా జోరుగా సాగుతోంది.అయితే ప్రజల్లో మరో సందేహం కూడా ఉంది, ఇన్ని రోజులుగా ఈ అక్రమ నిర్మాణాలు కళ్లముందే కొనసాగుతున్నా ఇప్పటివరకు టౌన్ ప్లానింగ్ చైన్ మెన్ లు, సెక్షన్ ఆఫీసర్ సత్య వర్ధన్, ఎసిపి సాయిబాబా, ఉన్నత అధికారులు ఎందుకు స్పందించలేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణాలు పునాదుల దశలో ఉన్నప్పుడే అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు ఆలస్యంగా చర్యలు తీసుకోవడం వెనుక కారణాలేమిటన్న చర్చ జరుగుతోంది. కొందరు అక్రమ నిర్మాణదారులు రాజకీయ అండతోనే ఇంత ధైర్యంగా నిర్మిస్తున్నారా లేక అధికారులు, సిబ్బంది లంచాలకు అమ్ముడుపోయారని వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. స్థానిక ప్రజలు మాత్రం ఈసారి కఠిన చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను పూర్తిగా కూల్చివేయాలని డిమాండ్ చేస్తున్నారు. కేవలం సీజ్ నోటీసులు ఇచ్చి మళ్లీ వదిలేస్తే అక్రమార్కులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తిరిగి నిర్మాణాలు చేయడం సహజంగా మారిందని పూర్తిస్థాయిలో కూల్చివేతలు చేస్తే కానీ సమస్య తీరదని స్థానికులు హెచ్చరిస్తున్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, డ్రైనేజ్ ఇబ్బందులు, పార్కింగ్ కష్టాలకు ఈ అక్రమ నిర్మాణాలే ప్రధాన కారణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో కూడా అక్రమ నిర్మాణాలపై నిరంతర చర్యలు కొనసాగుతాయని జిహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రకటించినప్పటికీ అధికారుల చర్యలు మాటల్లోనా.? లేక నిజంగానే కూల్చివేత్తలు చేయడం జరుగుతోందా.? అని ప్రశ్నిస్తున్నారు. మెట్టుగూడ సర్కిల్‌లో మొదలైన కఠిన చర్యలు నగరవ్యాప్తంగా అక్రమ నిర్మాణాల మాఫియాకు హెచ్చరికగా మారనున్నాయా.? లేదా అన్నది వేసి చూడాలి.

# అమెరికా 51వ రాష్ట్రంగా వెనెజువెలా

- ట్రంప్ పోస్టుతో దుమారం



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం వెనెజువెలాను అమెరికాలోని 51వ రాష్ట్రంగా పేర్కొంటూ ఒక గ్రాఫిక్ ఫొటోను సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. ఈ పోస్టు తీవ్ర దుమారం రేపింది. ట్రంప్ పోస్టును వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్జ్ తీవ్రంగా ఖండించారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన సమయంలో ఆయన నైట్ ట్రాక్ సూట్‌ను ధరించారు. ఆ సూట్‌ను పోలిన ట్రాక్ సూట్‌ను ధరించి, ఎయిర్ ఫోర్స్ వన్‌లో విమానంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ప్రయాణిస్తున్నట్లు కూడా ఈ పోస్టు ఉంది. డొనాల్డ్ ట్రంప్ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యేందుకు చైనాకు వెళ్లనున్న సమయంలో, సామాజిక మాధ్యమంలో ఈ పోస్టు పెట్టడం చర్చకు దారి తీసింది. వైట్ హౌస్ కూడా ఈ ఫొటోలను తన ఎక్స్ ఖాతాలో విడుదల చేసింది. వెనెజువెలాను తమ దేశంలోని కొత్త రాష్ట్రంగా పరిగణించాలని భావిస్తున్నట్లు ఇటీవల ఫాక్స్ న్యూస్‌తో ట్రంప్ పేర్కొన్నారు.

# భూమికి దూరంగా వెళ్లిపోతున్న 'చందమామ'

- ఏటా 3.8 సెంటీమీటర్ల చొప్పున పెరుగుతున్న దూరం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** మనకు రాత్రిపూట వెన్నెల కురిపించే చందమామ భూమి నుంచి నెమ్మదిగా దూరంగా జరిగిపోతున్నాడా? దీనివల్ల భూమిపై రోజు నిడివి పెరుగుతోందా? అంటే అవుననే అంటున్నారు శాస్త్రవేత్తలు. చంద్రుడు ఏటా సుమారు 1.5 అంగుళాలు (3.8 సెం.మీ.) చొప్పున భూమికి దూరమవుతున్నాడని, ఈ ప్రక్రియనే 'లూనార్ రిసెషన్' అని పిలుస్తారు.

### ఇదంతా ఆటుపోట్ల వల్లే..

ఈ ప్రక్రియ వెనుక ఉన్న ప్రధాన కారణం భూమి, చంద్రుడి మధ్య ఉండే గురుత్వాకర్షణ సంబంధం, దానివల్ల ఏర్పడే సముద్రపు ఆటుపోట్లే. లండన్‌కు చెందిన జియోఫిజిక్స్ ప్రొఫెసర్ డేవిడ్ వాల్‌థామ్ ప్రకారం, చంద్రుడి ఆకర్షణ శక్తి సముద్రాల్లో ఆటుపోట్లను సృష్టిస్తుంది. భూమి తన అక్షం మీద వేగంగా తిరగడం వల్ల, ఈ ఆటుపోట్ల ప్రభావం భూభ్రమణ వేగానికి ఒక బ్రేక్‌లా పనిచేసి, దాని వేగాన్ని స్వల్పంగా తగ్గిస్తుంది. ఈ క్రమంలో బదిలీ అయిన శక్తితో చంద్రుడు తన కక్ష్యలో కొంచెం పైకి నెట్టబడి, భూమి నుంచి మరింత దూరంగా వెళతాడు.

### చరిత్రలో, భవిష్యత్తులో మార్పులు

కోట్లాది సంవత్సరాల క్రితం భూమిపై రోజు నిడివి కేవలం 13 గంటల లోపే ఉండేది. చంద్రుడు భూమికి చాలా దగ్గరగా ఉండటమే దీనికి కారణం. ప్రస్తుతం ప్రతి శతాబ్దానికి రోజు నిడివి సుమారు 1.09 నుంచి 1.78 మిల్లీసెకన్ల చొప్పున పెరుగుతోంది. వాతావరణ మార్పుల కారణంగా ధ్రువాల వద్ద మంచు కరిగి సముద్ర మట్టాలు పెరగడం ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తోందని నిపుణులు భావిస్తున్నారు. అపోలో మిషన్‌లో భాగంగా చంద్రుడిపై అమర్చిన రిఫ్లెక్టర్ల సహాయంతో ఈ దూరాన్ని శాస్త్రవేత్తలు కచ్చితంగా కొలుస్తున్నారు. అయితే, ఈ మార్పు మన దైనందిన జీవితంలో గమనించలేనంత సూక్ష్మంగా ఉంటుంది. చంద్రుడు భూమిని పూర్తిగా వదిలి వెళ్లే ప్రమాదం లేదని, కొన్ని బిలియన్ల సంవత్సరాల తర్వాత సూర్యుడిలో మార్పులు వచ్చినప్పుడు మాత్రమే భూమి-చంద్ర వ్యవస్థలో పెను మార్పులు సంభవిస్తాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.౦

# మంత్రికి తప్పిన ప్రమాదం

- ప్రైవేట్ ఆస్పత్రిలో తెగిపడిన లిఫ్ట్
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు గాయాలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా అక్కడ ఆయన ఒక పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కరీంనగర్‌లో ఉన్న ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒక రైతును పరామర్శించేందుకు వెళ్లిన సమయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ఈ ఘటన ఎదురైంది. ఆస్పత్రిలో పై అంతస్తుకు వెళ్లేందుకు మంత్రి లక్ష్మణ్ సహా పలువురు లిఫ్ట్ ఎక్కగా అది మధ్యలోనే ఆగిపోయింది. లిఫ్ట్ ఒక్కసారిగా ఆగిపోవడంతో వారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఆ సమయంలో ఆ లిఫ్ట్‌కు ఉన్న వైరు అకస్మాత్తుగా ఆగిపోవడంతో అది వేగంతో కిందికి పడిపోయింది. ఈ ఘటనతో ఒక్కసారిగా మంత్రి అడ్లూరితో పాటు ఆయన వెంట ఉన్న నేతలు, సెక్యూరిటీ షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనలో మంత్రికి స్వల్ప గాయాలు కాగా వెంటనే అప్రమత్తమైన ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది లిఫ్ట్ తలుపులు తెరిచి బయటికి తీసుకువచ్చారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది ఆయనకు చికిత్స అందించారు. పెను ప్రమాదం నుంచి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588